సాక్షి
కుమురం భీం

శనివారం, 6, మే, 2023



ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది..!

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు డీఈఈ రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 8లో▸



ఘనంగా బుద్ధుడి జయంతి

జిల్లా వ్యాప్తంగా గౌతమ బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు బుద్ధుడి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.2 /27.5

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9న కౌన్సెలింగ్

ఆసిఫాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల నియామకానికి ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల నియామకానికి 1:1 నిష్పత్తితో అభ్యర్థుల జాబితాను https://asifabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక



చిన్నారిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి లక్కీడ్రా ద్వారా విద్యార్థిని ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ రాజేశం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం లక్కీడ్రా నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు కేటాయించిన సీటు కోసం లక్కీడ్రా నిర్వహించగా తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన సాత్విక్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారిని అభినందించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల జిల్లా అధికారి సజీవన్, డీఈవో అశోక్ తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి నేడు ప్రజావాణి

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని బాబాపూర్ గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం శనివారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముష్కూర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. బాబాపూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరవుతారని పేర్కొన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించి, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ మాట్లాడుతూ 130కి పైగా ఉప కులాలతో అతి పెద్ద సంక్షేమ సంఘంగా ఏర్పడినా ఇప్పటివరకు జిల్లాలో బీసీ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించలేదన్నారు. సంఘం కార్యక్రమాలను ప్రైవేటు స్థలాలు, అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. నిరుపేద బీసీ బిడ్డలు ఉన్నత విద్యనభ్యసించినా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు జిల్లాలో స్టడీసర్కిల్ లేక దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మిట్ట తిరుపతి, పూదరి నారాయణ, వైరాగడే మారుతి, రుకుం ప్రహ్లాద్ ఉన్నారు.

'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామనడం హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే అవుతుందన్నారు. పార్టీ కార్యాలయంలో హనుమాన్ చాలీసా పఠనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సేర్ల మురళీధర్, నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన టేలాలు

ఆర్టీసీ కాంప్లెక్స్‌కు దారేది!

- 18 దుకాణాలకు అడ్డంగా అనధికారిక టేలాలు
- ఆరేళ్లుగా ఇక్కట్లు పడుతున్న దుకాణ యజమానులు
- టేలాల తొలగింపును అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు!
- పంచాయతీకి నామమాత్రంగా ఫీజు చెల్లిస్తున్న టేలాదారులు
- వాటినే ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి రూ.వేలల్లో అద్దె వసూళ్లు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అనధికారిక టేలాలు వందల సంఖ్యలో ఉన్నాయి. కాస్త ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికిరాత్రే టేలాలు పెట్టేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన పంచాయతీ అధికారులు.. టేలాల యజమానులతో మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టేలాల యజమానులు పంచాయతీకి నామమాత్రంగా రూ.వందల్లో ఫీజులు చెల్లిస్తూ.. వాటిని మాత్రం రూ.వేలల్లో ఇతరులకు అద్దెలకిస్తూ భారీగా ఆదాయం గడిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అడ్డంగా వీటిని ఏర్పాటు చేసి, టెండర్ ద్వారా ఆర్టీసీ దుకాణాలను దక్కించుకున్న యజమానులను ఇక్కట్లు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం విడ్డూరం. ఆరేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడం వెనుక అధికార పార్టీల నేతలు ఉండటమే కారణమన్న ఆరోపణలున్నాయి.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 18 దుకాణాలు..

ఆదాయ మార్గాల్లో భాగంగా ఆసిఫాబాద్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో అంబేడ్కర్ చౌక్ నుంచి వివేకానంద చౌక్ మధ్య ఓ కాంప్లెక్స్‌ను ఆర్టీసీ యాజమాన్యం నిర్మించింది. ఇందులో 18 దుకాణాలు ఉన్నాయి. 20 ఏళ్ల లీజు అగ్రిమెంట్ చొప్పున టెండర్ ద్వారా దక్కించుకున్న వారికి దుకాణాలు కేటాయించారు. ఒక్కొక్క దుకాణం యజమాని అడ్వాన్సు కింద రూ.1.50 లక్షలు, ఆర్నెళ్ల అద్దె మొదటగా చెల్లించేశారు. ఒక్కో దుకాణం నుంచి రూ.5,600 నుంచి రూ.10 వేల వరకు ఆర్టీసీకి అద్దె వస్తోంది. అయితే కాంప్లెక్స్ నిర్మాణానికి ముందు ఉన్న టేలాలను తొలగించి దుకాణాలను అప్పగిస్తామన్న ఆర్టీసీ ఉన్నతాధికారులు తర్వాత ఆ విషయాన్ని విస్మరించారు. టేలాలను తొలగించేందుకు తొలుత యత్నించగా రాజకీయ నేతలు అడ్డుకోవడంతో వెనక్కితగ్గారు. యజమానుదారులకు దుకాణాలను అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. టేలాలు అడ్డంగా ఉండటంతో కాంప్లెక్స్‌లోని దుకాణాలకు దారి లేకుండా పోయింది. ఫలితంగా దుకాణాలు దక్కించుకున్న యజమానులు వ్యాపారాలు జరగకపోయినా ప్రతినెలా అద్దెల భారం మోస్తున్నారు. ఇప్పటివరకు ఒక్కో యజమాని రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఆర్టీసీకి అద్దె రూపంలో చెల్లించినట్లు తెలుస్తోంది.

టేలా పెట్టు.. అద్దె పట్టు

జిల్లా కేంద్రంలో అనధికారికంగా వెలిసిన టేలాలకు రూ.వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. టేలా యజమానులు పంచాయతీకి మాత్రం నెలకు రూ.వంద చొప్పున ఫీజులు చెల్లిస్తుండటం గమనార్హం. ఒక్క టేలాలోనూ యజమానులు వ్యాపారం చేయడం లేదని తెలుస్తోంది. ఇందులో 90 శాతం వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చేసి జేబులు నింపుకుంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన దాదాపు 20 టేలాల్లో కేవలం నలుగురు యజమానులు మాత్రమే సొంతంగా వ్యాపారం చేస్తున్నారు. మిగిలిన వారు అద్దెలతో వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రి రహదారిలో సైతం ఇదేవిధంగా టేలాలు వెలిశాయి. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శనివారం సంత కూడా ఇక్కడే జరుగుతోంది. ఈ ప్రాంతంలోనే రెండు పాఠశాలలు ఉండటం.. టేలాల ఏర్పాటుతో మార్గం ఇరుకుగా మారడంతో తరచూ విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికార యంత్రాంగం మాత్రం ఈ టేలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంలో మిన్నకుండిపోవడం శోచనీయమని ఆర్టీసీ కాంప్లెక్స్ దుకాణ యజమానులు వాపోతున్నారు. ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు ఆసిఫాబాద్ జిల్లాగా మారిందని ఇప్పటికైనా కలెక్టర్ మా సమస్యపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

దిగిన లిక్కర్ ధర

- ఫుల్‌బాటిల్‌పై రూ.40 డౌన్
- అమ్మకాలు తగ్గడంతో ప్రభుత్వ నిర్ణయం
- నేటి నుంచి అమలులోకి

సాక్షి, ఆదిలాబాద్: మందు బాబులకు సర్కారు తీపి కబురు అందించింది. లిక్కర్ ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఫుల్‌బాటిల్‌పై రూ.40 తగ్గనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లిక్కర్ సేల్స్ ద్వారా ప్రభుత్వానికి నాలుగు శాతం ఆదాయం పెరిగింది. అయినా అమ్మకాలు మాత్రం పడిపోయాయి. ఇది ఎలాగని ఆశ్చర్యపోతున్నారా.. ఏడాది క్రితం ప్రభుత్వం వీటి ధరలు పెంచింది. ఆ కారణంగా అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరిగింది. అయితే ప్రభుత్వ లక్ష్యం భిన్నంగా ఉంటుంది. అమ్మకాలతో పాటు ఆదాయమూ పెరగాలి. అయితే ఇక్కడ సేల్స్ తగ్గిపోవడం, ఆదాయం నామమాత్రంగా పెరగడం కారణంగా ప్రభుత్వం తాజాగా ధరల విషయంలో దిగివచ్చింది. దీనికి సంబంధించి జీవో జారీ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 వైన్స్‌లు, 39 బార్లు ఉన్నాయి. వీటి ద్వారా 2021–22 తో పోల్చితే 2022–23లో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) కేసుల అమ్మకాలు 3లక్షల 2వేల 933 తగ్గాయి. ఇంత పెద్ద మొత్తంలో తగ్గడంతో ఎక్సైజ్ అధికారులు తలపట్టుకోవాల్సిన పరిస్థితి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటే స్థితే ఉండడంతో ఎక్కడో పొరపాటు జరిగిందనేది ప్రభుత్వం తర్జనభర్జన పడింది. ప్రధానంగా గతేడాది ప్రభుత్వం లిక్కర్ ధరలను అమాంతంగా పెంచింది. ఇది పొరుగు రాష్ట్రాల్లో ధరలతో పోల్చితే అధికంగా ఉండడంతో మందుబాబులు సరిహద్దుకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి కొనుగోలు చేయడంతోనే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ధరలు తగ్గింపుపై దృష్టి సారించింది. అయినా మహారాష్ట్రతో పాటు ఇప్పటికీ అధికంగా ఉన్నాయన్న అభిప్రాయం మందుబాబుల్లో వ్యక్తమవుతుంది.

చీప్‌లిక్కర్‌పైనే ప్రభావం..

సాధారణంగా ఐఎంఎల్, బీర్ కేసుల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అయితే ఐఎంఎల్ అమ్మకాలే అధిక ఆదాయానికి దోహద పడుతుంది. బీర్ల అమ్మకాలు పెరిగినా ఐఎంఎల్ సేల్స్ తగ్గిపోవడం ప్రభుత్వానికి ఆలోచనకు గురిచేసింది. ప్రధానంగా చీప్ లిక్కర్ అమ్మకాలు తగ్గడంతో ఆదాయంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. లిక్కర్ ధర రూ.400 లోపు ఉన్నది చీప్‌లిక్కర్‌గా పరిగణిస్తారు. రూ.700లోపు ఉన్నదాన్ని మీడియం లిక్కర్‌గా, రూ.850 పైన దాన్ని ప్రీమియం లిక్కర్‌గా పరిగణిస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 49శాతం చీప్ లిక్కర్ అమ్మకాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిపోయాయి. ఇది భారీగా రావాల్సిన ఆదాయంపై ప్రభావం చూపుతుంది. మీడియం లిక్కర్ 17శాతం, ప్రీమియం లిక్కర్ 12 శాతం అమ్మకాలు తగ్గాయి. మొత్తంగా లిక్కర్ సేల్స్‌పై ధరల పెంపు ప్రభావమే కనిపించిందని ఎక్సైజ్ అధికారులు బాహాటంగానే పేర్కొంటున్నారు. దీంతోనే ఆదాయం తగ్గిందని చెబుతున్నారు.



వైన్స్‌లో మద్యం బాటిళ్లు

మద్యం ధరలు తగ్గింపు



లిక్కర్ ధరలను ప్రభుత్వం తగ్గిస్తూ జీవో జారీ చేసింది. శనివారం నుంచి అమలు కానున్నాయి. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే పాత స్టాక్ అదే ధరలపై అమ్మడం జరుగుతుంది. కొత్త స్టాక్ వచ్చిన తర్వాత నూతన ధరలు అమల్లోకి వస్తాయి.

– నర్సింహారెడ్డి, డెప్యూటీ కమిషనర్, ఎక్సైజ్‌శాఖ

లిక్కర్, బీర్ కేసుల అమ్మకాలు.. ఆదాయం

సంవత్సరం	ఐఎంఎల్ కేసులు	బీర్ కేసులు	ఆదాయం (రూ. కోట్లలో)
2021–22	21,75,425	17,47,653	1,649
2022–23	18,72,492	22,77,981	1,716
వ్యత్యాసం	3,02,933	5,30,328	67
శాతం	-14	30	4



పట్టణాన్ని ఆకుపచ్చగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని రాష్ట్రీయ రహదారి డివైడర్ మధ్యలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని దుకాణాల సముదాయాల ఎదుట ప్రతిఒక్కరూ బాధ్యతగా కనీసం రెండు మొక్కలు నాటాలన్నారు. ఈ మేరకు వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని పంచాయతీ ఇన్‌చార్జి ఈవో వంశీకృష్ణను ఆదేశించారు. మొక్కలను సంరక్షించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ అధికారులు సంతోష్, ఇతర సిబ్బంది ఉన్నారు.



జిల్లా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

పోషకాహారం అందించేందుకు చర్యలు

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సకాలంలో పోషకాహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీశిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి సావిత్రితో కలిసి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొలాం గిరిజన గ్రామాల్లో మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సక్రమంగా పోషకాహారం పంపిణీ చేసి, చిన్నారుల ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు లేని చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారంపై దృష్టి సారించాలన్నారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యుత్‌శాఖ అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని ఆ శాఖ డీఈ ప్రసాద్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిరోజూ ఒక్క యూనిట్ కరెంట్ ఆదా చేసినా జీవితకాలంలో రూ.లక్ష సంపాదించినట్టేనని అన్నారు. వినియోగదారులు ఫ్యూజులు మార్చడం, వీధి దీపాల ఏర్పాటు చేయడం, ఇతర మరమ్మతులు చేపట్టొద్దని సూచించారు. అవగాహన లేకుండా పనులు చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడటం ప్రమాదకరమన్నారు. ఎల్‌ఈడీ బల్బులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ రమేశ్, ఎల్‌ఐలు రాజశేఖర్, ఆలాం తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఈ ప్రసాద్


డీపీఆర్ దాటని వార్ధా !

- నాలుగేళ్లుగా ప్రతిపాదనల దశలోనే
- తాజాగా మరోసారి డీపీఆర్ సిద్ధం
- ఏటేటా పెరుగుతున్న నిర్మాణ అంచనా
- ఈ నివేదికతోనైనా అడుగు పడేనా?


సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టు పక్కకు పోయి, ఆ స్థానంలో వార్ధా ప్రాజెక్టు నిర్మాణం గత నాలుగేళ్లుగా ఇక్కడి రైతాంగాన్ని ఊరిస్తూనే ఉంది. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారుతోంది. 2007లో రూ.38వేల కోట్లతో కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవేళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రీ డిజైన్లలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా కాళేశ్వరం మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించడంతో ప్రాణహిత మరుగున పడిపోయింది. అప్పటికే ప్రాణహిత ప్రాజెక్టు కోసం కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో గ్రావిటీతో నీరు వెళ్లేలా కాలువలు తవ్వారు. ప్రధాన ప్రాజెక్టు నిర్మించక, కొత్త ప్రాజెక్టుపై స్పష్టత లేకపోవడంతో ఏళ్లుగా ఇక్కడి రైతాంగానికి బ్యారేజీ నిర్మాణం ఉంటుందా? లేదా? అనే సందేహాలు వచ్చాయి. ఈ క్రమంలో తాజాగా మరోసారి వార్ధాపై బ్యారేజీ నిర్మాణం కోసం కేంద్ర జల సంఘానికి డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించడంతో మళ్లీ తెరపైకి వచ్చింది.

రీ డిజైన్‌తో దెబ్బ

ప్రాణహిత నదిపై ప్రాజెక్టు ప్రతిపాదనల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు అంచనా వేశారు. ప్రాజెక్టు కోసం కాలువలు, భూసేకరణ అంతా జరిగినప్పటికీ ప్రధాన బ్యారేజీ మొదలు కాలేదు. ఆ తర్వాత రీ డిజైన్‌లో భాగంగా ప్రాణహిత ఎత్తు తగ్గించి, తక్కువ వ్యయంతో సిర్పూర్‌లో పూర్తి స్థాయి, బెల్లంపల్లి నియోజకవర్గంలో కొంతమేర నీరు అందించేలా అదే ప్రాంతంలో బ్యారేజీ నిర్మించేలా ప్రతిపాదనలు చేశారు. చివరకు ఆ ప్రాంతంలో అసలు ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా లేదని, పర్యావరణ అనుమతులు, సాంకేతిక కారణాలతో ప్రాణహిత ప్రతిపాదన పూర్తిగా వెనక్కి పోయింది. చివరకు తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా వార్ధా నదిపై కొత్తగా ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నాలుగేళ్ల క్రితమే వాప్కోస్ సంస్థకు డీపీఆర్ ఇవ్వాల్సిందిగా కోరారు. తక్కువ నది వెడల్పు, తక్కువ ఎత్తులో, భూ సేకరణ తగ్గించేలా నివేదికను రూపొందించారు. ఆ లెక్కల ప్రకారం వార్ధాపై రూ.750కోట్లతో 36గేట్లతో బ్యారేజీ ఉంటుందని అంచనా వేశారు. గతేడాది మరోసారి మూడు పంపులతో ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో 11వేల ఎకరాలకు నీరందించేలా ప్రణాళిక వేశారు. ఈ ప్రతిపాదన ముందుకు కదలలేదు. గతేడాది మరోసారి నివేదికలు రూపొందించేలా సీఎంవో నుంచి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కౌటాల మండలం వీర్దండి సమీపంలో వార్ధా నది వరకు వెళ్లి పరిశీలనలు చేశారు. రూ.వెయ్యి కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తాజాగా డీపీఆర్ సిద్ధం చేసి జల వనరుల సంఘానికి అందజేయాలని రాష్ట్ర సాగునీటి అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కొత్త డీపీఆర్ ప్రకారం రూ.4,874 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ క్రమంలో వార్ధా నది నిర్మించే ప్రధాన బ్యారేజీతో కుమురంభీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గానికే పరిమితం చేస్తారా? బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలకు సాగు నీరందిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.



వార్ధా నది(ఫైల్)



రెండేళ్ల కిందట రూపొందించిన ప్రాజెక్టు డిజైన్

వృథాగా ప్రాణహిత కాలువలు

భూ సేకరణ, పైపులు రూ.693 కోట్లు ఖర్చు చేసి తవ్విన కాలువలు ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరందించక వృథాగా మారాయి. మొత్తం ఖర్చులో భారీ పైపుల కోసమే రూ.350 కోట్ల వరకు వెచ్చించారు. ఈ కాలువలు కౌటాల, చింతలమానెపల్లి, దహెగాం, నెన్నెల, మందమర్రి మండలాలకు తవ్వారు. వీటిని తిరిగి వినియోగంలోకి తేవాలంటే ప్రధాన బ్యారేజీతో అనుసంధానం చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే వందల కోట్లు ప్రజాధనం నీటిపాలు కానుంది. ఎనిమిదేళ్లుగా వృథాగా పడి ఉన్న పైపులను గత మూడు నెలలుగా ఎల్లంపల్లి వరద కాలువకు మిడ్‌మానేరు నుంచి మల్లన్నసాగర్‌కు కాలువల నిర్మాణం కోసం ఇక్కడి పైపులను భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. పైపుల తరలింపుపై స్థానిక రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది.

'ఐటీలో కోత విధించడం సరికాదు'

కాగజ్‌నగర్‌టౌన్: ఇన్‌కమ్ ట్యాక్స్‌లో కోత విధించడం సరికాదని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కాగజ్‌నగర్ అధ్యక్షుడు జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని ట్రెజరీ అధికారికి శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం, ట్రెజరీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే కోత విధించడం సరికాదన్నారు. గతేడాది ఐటీ ఎంత మొత్తం కోత విధించారో.. ప్రస్తుతం అంతే మొత్తంలో కోత విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఏఎస్ ఆర్ మూర్తి, భావనపల్లి నర్సయ్య, షేక్ మహబూబ్, మక్బూల్ హుస్సేన్, అల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


నవీన్‌కుమార్‌(ఫైల్‌)

తాండూర్‌: మండల కేంద్రంలోని బోయ వాడ వాల్మీకి నగర్‌కు చెందిన ఓ యువకు డు అదృశ్యమయ్యాడు. తాండూర్‌ ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బోయవాడ వాల్మీకి నగర్‌లో నివాసం ఉంటున్న మాత్కుల నవీన్‌కుమార్‌ ఈ నెల 3న బెల్లంపల్లిలో తన స్నేహితుడి పెళ్లి ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రెండ్రోజు లు గడిచినా ఇంటికి రాకపోవడంతో అతడి భార్య మల్లేశ్వరి శుక్రవారం తాండూర్‌ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నవీన్‌కుమార్‌ మందమర్రి సింగరేణి ఏరియాలో హెడ్‌ ఓవర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సమాచా రం తెలిస్తే 8712656575 నంబరులో సమాచారం అందించాలని ఎస్సై కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

ఆసిఫాబాద్‌రూరల్‌: ఇంటి పెరటి స్థలం వివాదంలో మహిళపై గొడ్డలితో దాడి చేసిన ఘటన ఆసిఫాబాద్‌ మండలం గొల్లగూడలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడ గ్రామానికి చెందిన ఎల్లగాల సత్తయ్యకు ఇంటి పక్కనే ఉంటున్న బోయిని పోశక్కకు ఇంటి పెరటి స్థలం విషయంలో వివాదం ఉంది. శుక్రవారం మళ్లీ ఇదే విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సత్తయ్య గొడ్డలితో పోశక్కపై దాడి చేయడంతో మెడ, చెవిపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు పోశక్కను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. పోశక్క కుమారుడు అంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రఘునాథ్‌

దండేపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌ డిమాండ్‌ చేశారు. దండేపల్లి మండలం గూడెం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం తడిసిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లలో జాప్యం, అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు.

దొనబండలో వైభవంగా రథోత్సవం


రథ శోభాయాత్రలో భక్తులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలం దొనబండ గ్రామ శివారులోని పురాతన రాజరాజేశ్వర స్వామి సహిత సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ వార్షికోత్సవ వేడుకలు రథోత్సవంతో ముగిశాయి. వీధుల్లో రథోత్సవ శోభాయాత్ర కనులపండవగా సాగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పాలాస శ్రీశైలం, ముస్త్యాల రమాకాంత్‌శర్మ, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది..!



- డీఎడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఉమ్మడి జిల్లాలో ఏడు కళాశాలలు
- అందుబాటులో 500 సీట్లు
- ఈ నెల 22వరకు దరఖాస్తు గడువు

నిర్మల్‌ ఖిల్లా: సమాజంలో ఉపాధ్యాయులంటే గౌరవం ఎక్కువ. అందుకే తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులకిచ్చారు. ఈ వృత్తి.. సమాజంలో ఓ బృహత్తర బాధ్యత. ఉపాధి కల్పించే మార్గం కూడా.. ఇటు ప్రభుత్వ రంగంలో వేలసంఖ్యలో ఖాళీలు భర్తీ చేస్తుండగా.. అటు ప్రైవేట్‌ రంగంలోనూ అవకాశాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో విద్యారంగం విస్తరిస్తుండడం .. అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టంతో అవకాశాలు పెరిగిపోతున్నాయి. చిన్న వయస్సులో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టాలనుకునే వారికి ప్రభుత్వం మంచి అవకా శాన్ని కల్పిస్తోంది. ఇంటర్మీడియట్‌ పూర్తి చేసిన వారికి డిప్లొమా ఇన్‌ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌ (డీఈఈ) రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో టీటీసీ పేరుతో ఉండే ఈ కోర్సును ప్రస్తుతం డీఎడ్‌గా వ్యవహరిస్తున్నారు. సెకండరీ గ్రేడ్‌ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే వారికి డీఎడ్‌ అర్హత అవసరం . ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఇంటర్మీడియట్‌తో పాటు డీఎడ్‌ ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తర్వాత టెట్‌, టీఆర్టీ (డీఎస్సీ) ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం చేస్తారు. ఇప్పటికే ఇంటర్మీడియట్‌ పూర్తి చేసినవారు, ఈ ఏడాది ఇంటర్మీడియట్‌ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు డీఈఈ సెట్‌కు అర్హులు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఏడు డీఎడ్‌ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్‌ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ డైట్‌తోపాటు మరో ప్రైవేట్‌ కళాశాల ఉండగా, భైంసా, నిర్మల్‌ మంచిర్యాల, ఉట్నూర్‌, ఆసిఫాబాద్‌ ప్రాంతాల్లో మరో ఐదు ప్రైవేట్‌ కళాశాలలున్నాయి.

జిల్లా	కళాశాలలు	సీట్లు
ఆదిలాబాద్‌	3	300
నిర్మల్‌	2	100
కుమురంభీం	1	50
మంచిర్యాల	1	50
మొత్తం	7	500

ఇవీ.. అర్హతలు

భారతీయ పౌరులై ఉండి ఇంటర్మీడియట్‌ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బీసీ, ఓసీలు ఇంటర్‌లో కనీసం 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఈ ఏడాది సెప్టెంబర్‌ ఒకటో తేదీ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని ఏడు కళాశాలల్లో తెలుగు మాధ్యమంలో ఆరుచోట్ల, ఆంగ్లంలో మూడుచోట్ల, ఉర్దూలో ఒకచోట బోధనచేసే కళాశాలలున్నాయి. వంద ప్రశ్నలకు ప్రవేశపరీక్ష ఉంటుంది, ఒక్కో దానికి ఒక మార్కు చొప్పున వంద మార్కుల ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

డీఎడ్‌లో ప్రవేశం కోసం ఇంటర్మీడియట్‌ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో అభ్యర్థి రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టీటీటీ. ఛీఛీఛీ. ఛీఛీట్బ్బ్ ౖఖఙ్ఙ్. జౌరిజీ ద్వారా అభ్యర్థి పేరు, పుట్టినతేదీ, ఫోన్‌ నంబర్‌ తదితర వివరాలు అందజేసి ఫీజు చెల్లించిన వారికి రెఫరెన్స్‌ ఐడీ ఇస్తారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు పత్రంలోని పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. టీఎస్‌ డీఈఈ సెట్‌ వెబ్‌సైట్‌ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. తెల్ల కాగితంపై అభ్యర్థి ఫొటో అతికించి దాని కింద సంతకం చేయాలి. ఫొటో 50 కేబీ, సంతకం 30 కేబీలోపు ఉండేలా స్కాన్‌ చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తులు ప్రారంభం:	ఏప్రిల్‌ 22
తుది గడువు:	మే 22
హాల్‌టికెట్లు డౌన్లోడ్‌ చేసుకోవడం:	మే 27
ఆన్‌లైన్‌ పరీక్ష తేదీ:	జూన్‌ 1
ఫలితాల ప్రకటన:	జూన్‌ 8
ధ్రువీకరణ పత్రాల పరిశీలన, వెబ్‌ ఆప్షన్లు, సీట్లు/కళాశాలల కేటాయింపు:	జూన్‌15 నుంచి జూలై 5 వరకు
తరగతులు ప్రారంభం:	జూలై 12 నుంచి

ఇవీ.. కోర్సు వివరాలు

ఇంటర్‌తో ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించే కోర్సు ఇది. రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్‌ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌ (డీఈడీ) ప్రథమ సంవత్సరంలో విద్యా మనో విజ్ఞానశాస్త్రం, విద్యాతత్వ శాస్త్రం, జనరల్‌ అంశాలైన పూర్వ ప్రాథమిక విద్య-ప్రస్తుత విద్య, ఆరోగ్యం, విద్య-కంప్యూటర్‌ ఎడ్యుకేషన్‌, వయోజనవిద్య తదితర సబ్జెక్టులు ఉంటాయి. రెండో సంవత్సరంలో తెలుగు, ఇంగ్లిష్‌, మ్యాథ్స్‌, సైన్స్‌, సోషల్‌ సబ్జెక్టుల బోధన పద్ధతులను బోధిస్తారు. కోర్సులో భాగంగా టీచింగ్‌ ప్రాక్టీస్‌ 75 రోజులు ఉంటుంది. ఇందులో 35 రోజులు ప్రాథమిక పాఠశాలలు, 10 రోజులు ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధించాలి. 30రోజులపాటు పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌ ఉంటుంది. డీఈడీ ఉత్తీర్ణులు ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీ (టీఆర్టీ)లో సెకండరీ గ్రేడ్‌ టీచర్‌ (ఎస్‌జీటీ) పోస్టుకు అర్హులు. ఎస్‌జీటీ పోస్టులను గతంలో కేవలం డీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయగా ప్రస్తుతం బీఎడ్‌ వారికి కూడా అవకాశం కల్పించారు.

వారంలో పెళ్లి.. యువకుడి మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో జేఎల్‌ఎం దుర్మరణం
- ఉద్యోగానికి సెలవు పెట్టి వస్తుండగా ఘటన


లక్సెట్టిపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు


సాయి మృతదేహం

దండేపల్లి: మరో వారం రోజుల్లో ఆ యువకుడి పెళ్లి. తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి.. ఉద్యోగానికి సెలవు పెట్టి మోటార్‌సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు. హార్వెస్టర్‌ రూపంలో మృత్యువు వెంటాడింది. వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతిచెందాడు. దండేపల్లి ఎస్సై కుందారపు ప్రసాద్‌, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెంకు చెందిన ఒగేటి సాయి(24) నిర్మల్‌ మండలం కొండాపూర్‌లో విద్యుత్‌ శాఖలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. అతడికి ఈ నెల 12 పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం ఉదయం కొత్తకొమ్ముగూడెం నుంచి నిర్మల్‌కు వెళ్లాడు. పెళ్లి కోసం ఉద్యోగానికి సెలవు పెట్టాడు. అక్కడి మిత్రులు, తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి తన స్నేహితుడు మహేష్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై రాత్రి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో దండేపల్లి మండలం మేదరిపేట సినిమా థియేటర్‌ సమీపంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న హార్వెస్టర్‌ వీరి మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. సాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లింట విషాదం..

ఒగేటి సత్తయ్య-లక్ష్మీ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కూతురుకు పెళ్లి చేశాడు. ఒక్కగానొక్క కొడుకు సాయి.. పైగా విద్యుత్‌ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి ఎంతో ఘనంగా చేయాలనుకున్నారు. వారం రోజుల్లో పెళ్లి ఉండడంతో ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంతలో రోడ్డు ప్రమాదంలో సాయి దుర్మరణం చెందడంతో ఆ ఇంట్లో తీరని విషాదాన్ని నింపింది. పెళ్లి వేడుకలతో సంతోషంగా ఉండాల్సిన కుటుంబ సభ్యులు.. కొడుకు మరణవార్తతో రోదనలు మిన్నంటాయి. చేతికి అందివచ్చిన కొడుకు, ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఎంతో అండగా ఉంటాడని కలలు కన్న ఆ తల్లిదండ్రులకు విధి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

పెళ్లి సెలవే శాశ్వత సెలవైంది..!

విద్యుత్‌ శాఖలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్న సాయికి పెళ్లి కుదరడంతో అక్కడ తనతో పనిచేసే తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచాడు. పెళ్లి కోసం సెలవు తీసుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతడు తీసుకున్న పెళ్లి సెలవులు శాశ్వత సెలవులయ్యాయి. సాయిని పెళ్లి కొడుకుగా చూడాలనుకున్న తన తోటి ఉద్యోగులు, మిత్రులకు అతడు విగత జీవిగా కనిపించడంతో ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ ఘటన కుటుంబీకులు, బంధువులు, మిత్రులను కలిచివేసింది.

ప్రభుత్వ పశువైద్యుడి ప్రైవేట్‌ వైద్యం!

- వైద్యం వికటించి ఎద్దు మృత్యువాత


మృతి చెందిన ఎద్దు

చింతలమానెపల్లి(సిర్పూర్‌): తన పరిధి కాని ప్రాంతంలో ప్రభుత్వ పశువైద్యుడు ఆదాయం కోసం చేసిన వైద్యం వికటించింది. పశువు మృతి చెందడంతో వైద్యుడు పరారైన ఘటన చింతలమానెపల్లి మండలం గూడెంలో చోటు చేసుకుంది. గూడెం గ్రామానికి చెందిన కొంపరి దిలీప్‌కు చెందిన ఎద్దు ఇటీవల అనారోగ్యానికి గురైంది. తెలిసినవారు చెప్పడంతో వైద్యం కోసం బాబాసాగర్‌ గ్రామానికి చెందిన పశువైద్యుడు ధన్‌రాజ్‌ను సంప్రదించాడు. గూడెం గ్రామానికి చేరుకున్న ధన్‌రాజ్‌ ఎద్దు వృషణాలను తొలగించారు. వైద్యం చేస్తుండగానే ఎద్దు అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందింది. దీంతో ధన్‌రాజ్‌ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ప్రాణాలతో ఉండగానే ఎద్దును అలాగే వదిలేసి వైద్యుడు పారిపోయాడని బాధిత రైతు ఆరోపించాడు. వ్యవసాయం చేసి బతికే తనకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ ఆదుకోవాలని కోరుతున్నాడు. వైద్యం చేసిన డాక్టర్‌ చింతలమానెపల్లి మండలం బాబాసాగర్‌ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా.. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల ప్రభుత్వ పశువైద్యశాలలో విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. ఈ విషయంపై ధన్‌రాజ్‌ను సంప్రదించగా రైతు ఫోన్‌లో పలుమార్లు కోరడంతోనే తాను చికిత్స నిర్వహించానని తెలిపారు. సరైన పద్ధతిలోనే వైద్యం చేసినా పరిస్థితి విషమించి ఎద్దు మృతి చెందినట్లు వెల్లడించారు.

పెండింగ్‌ ఏరియర్స్‌ చెల్లించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): హౌస్‌ కీపింగ్‌ కార్మికుల పెండింగ్‌ ఏరియర్స్‌ వెంటనే చెల్లించాలని హెచ్‌ఎంఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్‌ డిమాండ్‌ చేశారు. హెచ్‌ఎంఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లో జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గౌస్‌ మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్‌ చేయాలన్నారు. ఢిల్లీ, ఒరిస్సాల తరహాలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. గుర్తింపు సంఘం వైఫల్యం కారణంగానే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో గాంధేయ మార్గంలో కార్మికుల పక్షాన నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫిట్‌ కార్యదర్శి బాలేష్‌, ఏరియా ఆర్గనైజర్‌ శంకరమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాధనతో మెరుగైన క్రీడా నైపుణ్యాలు

- జీఎం దేవేందర్‌
- భీమన్న స్టేడియంలో శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): నిత్య సాధన ద్వారా మెరుగైన క్రీడా నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చని బెల్లంపల్లి ఏరియా జనరల్‌ మేనేజర్‌ దేవేందర్‌ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో శుక్రవారం వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలోని కార్మికుల పిల్లల కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల రోజులపాటు వాలీబాల్‌, పుట్‌బాల్‌, అథ్లెటిక్స్‌లో శిక్షణ సాగుతుందన్నారు. క్రీడాకారులు నచ్చిన ఆటలో నైపుణ్యం సాధించేందుకు నిరంతరం సాధన చేయాలని సూచించారు. ఇందుకోసం యాజమాన్యం అన్ని వసతులు కల్పించిందన్నారు. క్రీడాకారులు, విద్యార్థులు క్రమశిక్షణతో మెదులుతూ క్రీడలపై పట్టు సాధించాలని కోరారు. మైదానంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్‌ లక్ష్మణరావు, టీబీజీకేఎస్‌ నాయకులు మాంతు సమ్మయ్య, స్పోర్ట్స్‌ కోఆర్డినేటర్‌ చంద్రకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- రూ.1.40 లక్షల విలువైన 37 కిలోలు స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు


పోలీసుల అదుపులో నిందితులు, నకిలీ విత్తనాలు

దహెగాం(సిర్పూర్‌): నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ సీఐ సుధాకర్‌ ఆధ్వర్యంలో దహెగాం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సోదాలు నిర్వహించామని ఎస్సై సనత్‌కుమార్‌ తెలిపారు. ఈ మేరకు గొర్రెగుట్ట గ్రామానికి చెందిన చాపిడి రాజు, చాపిడి కృష్ణ ఇళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. భీమిని మండలం కేస్లాపూర్‌ గ్రామానికి చెందిన జిల్లా చంద్రకుమార్‌ వద్ద నుంచి వీరు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ముగ్గురు నిందితుల వద్ద నుంచి రూ.1.40 లక్షల విలువైన రూ.37 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. అమాయక రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్‌ ఎస్సై సందీప్‌కుమార్‌, సిబ్బంది మధు, రమేశ్‌, సంజయ్‌ ఉన్నారు.

ఇంటి పట్టా అందజేత

నెన్నెల: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన గంధం గోపాల్‌కు జిల్లా అదనపు మధుసూదన్‌నాయక్‌ శుక్రవారం 58, 59 జీవో కింద మంజూరైన ఇంటి పట్టాను అందజేశారు. గతేడాది అందిన దరఖాస్తుల్లో గోపాల్‌ దరఖాస్తు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా ఉండడంతో ఇంటి పట్టా మంజూరు చేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ భూమేశ్వర్‌, డీటీ ప్రకాష్‌, ఆర్‌ఐ గణేష్‌, మండల సర్వేయర్‌ మణిరాజ్‌, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఖనిజాల అన్వేషణ..!

- ప్రాణహిత, పెన్‌గంగ తీర ప్రాంతాల్లో విమానం చక్కర్లు
- స్థానిక ప్రజల్లో అనేక అనుమానాలు
- అరుదైన ఖనిజాల అన్వేషణలో భాగమేనా..?

చింతలమానెపల్లి(సిర్పూర్‌): కుమురంభీం జిల్లాలో ఇటీవల చిన్నతరహా విమాన సంచారం సంచలనం కలిగించింది. భూతలానికి సమీపంలోనే విమానం ప్రయాణించడంతో ఆసక్తిగా గమనించిన స్థానికులు.. చాలాసార్లు చక్కర్లు కొట్టడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో అధికారులు సైతం వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు.

చంద్రపూర్‌ మోర్వా ఎయిర్‌పోర్ట్‌ నుంచి..

భూ ఉపరితలానికి సమీపంలో ఆకాశంలో చక్కర్లు కొడుతున్న విమానం బీఎన్‌2బీ (బ్రిటన్‌ నార్మన్‌) ఐస్‌లాండర్‌ ఎయిర్‌ క్రాఫ్ట్‌. దీనిని చిన్నతరహా గగనతల అవసరాలకు వినియోగిస్తారు. కుమురంభీం జిల్లాలోని ప్రాణహిత, పెన్‌గంగ తీర ప్రాంతాల్లో గల మండలాల్లో ఈ విమానం చక్కర్లు కొట్టడంతో అధికారులు ఆరా తీశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ విమానం మహారాష్ట్రలోని చంద్రపూర్‌ జిల్లా కేంద్రంలో గల మోర్వా ఎయిర్‌పోర్ట్‌ నుంచి వస్తున్నట్లు తెలిసింది. ఈ ఎయిర్‌ క్రాఫ్ట్‌లో అయస్కాంత, రేడియేషన్‌ తరంగాల ద్వారా భూమిలోని ఖనిజాలను గుర్తించే పరికరాలతో సర్వే నిర్వహిస్తున్నారు.


చంద్రపూర్‌లో ఎయిర్‌క్రాఫ్ట్‌


ప్రభుత్వ ఉత్తర్వు కాపీ

2022 నుంచి..

జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా నుంచి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 2022 నవంబర్‌ నుంచి ‘నేషనల్‌ ఎయిర్‌బోర్న్‌ జియోఫిజికల్‌ మ్యాపింగ్‌ ప్రోగ్రాం(జాతీయ గగనతల భూభౌతిక పటం గుర్తింపు)’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కెనడా కేంద్రంగా పనిచేసే సాండర్‌ జియో ఫిజికల్‌ సర్వీసెస్‌, పాన్‌ ఇండియా కన్సల్టెంట్‌ అనే సంస్థలు ఈ సర్వే నిర్వహిస్తున్నాయి. భూఅంతర్భాగంలో ఉన్న సంక్లిష్ట ఖనిజాలు, అరుదైన ఖనిజాలను గుర్తించేందుకు అత్యాధునిక పరికరాలతో ఈ సంస్థలు సర్వే చేపడతాయి.

చంద్రపూర్‌ నుంచి బస్తర్‌ జిల్లా వరకు..

చంద్రపూర్‌ జిల్లాలోని ఎయిర్‌పోర్ట్‌ నుంచి సర్వే నిర్వహిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్‌.. కుమురంభీం జిల్లాతోపాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ జిల్లా వరకు తెలంగాణలోని మంచిర్యాల, నల్గొండ, ఖమ్మం జిల్లాల వరకు చక్కర్లు కొడుతోంది. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగానే గుర్తించిన ప్రాంతాల్లో అరుదైన ఖనిజాల లభ్యత, సాంద్రత అన్వేషణ కోసమే ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. పెన్‌గంగ, ప్రాణహిత, గోదావరి, ఇంద్రావతి పరీవాహక ప్రాంతాల్లో కోబాల్ట్‌, నికెల్‌ ఖనిజాలు ఉన్నట్లు గతంలో పరిశోధనల్లో వెల్లడైన విషయం తెలిసిందే. సర్వే నిర్వహిస్తున్న సాండర్‌ జియో ఫిజికల్‌ సర్వీస్‌, పాన్‌ ఇండియా కన్సల్టెంట్‌ సంస్థలకు లిథియం, గ్రాఫైట్‌, కోబాల్ట్‌ లాంటి ఖనిజాల అన్వేషణలో అనుభవం ఉంది. జీవవైవిధ్యం, ప్రాచీన అటవీసంపద కలిగిన ప్రాంతాల్లో జరుగుతున్న ఎయిర్‌క్రాఫ్ట్‌ సంచారం గమనిస్తే ఈ అన్వేషణ విలువైన ఖనిజాల కోసమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి.